ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

కుటుంబం మృత్యువాత

ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన ఐదుగురి దుర్మరణం

● గుడిహత్నూర్‌లో బోల్తాపడిన మ్యాక్స్ వాహనం..
● తాత, తండ్రి, మనవలు మృత్యువాత ● ప్రమాదస్థలాన్ని సందర్శించిన ఎస్పీ

మహమ్మద్ ఉస్మానొద్దీన్(ఫైల్)

సయ్యద్ మహమ్మద్ అలీ(ఫైల్)

ఖాజా మొయినోద్దీన్(ఫైల్)

ఆదిలాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. నిర్మల్ జిల్లా భైంసా నుంచి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్న మాక్స్ వాహనం సోమవారం అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి వద్ద అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి మొహిజొద్దీన్ తన మాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లాలోని భైంసాకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి ఆదిలాబాద్‌కు వస్తుండగా అర్ధరాత్రి మేకల గండి వద్ద వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న మొహిజొద్దీన్(65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్(40) మనవలు ఉస్మానొద్దీన్(11), ఫరీదొద్దీన్(12), మహమ్మద్ అలీ(8) మరణించారు. ప్రమాదంలో గాయపడిన అయేషా అఫ్రీన్, ఎఖ్రా, సాద్‌లను రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన తాత, తండ్రి, మనవలు మరణించడం ఆ కుటంబంలో విషాదాన్ని నింపింది. ప్రమాదంలో చనిపోయిన వారిని చూడటానికి మొహిజొద్దీన్ బంధువులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో రిమ్స్‌కు తరలివచ్చారు. శవాలకు పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు బంధువులకు అప్పగించారు. ప్రమాదం జరిగిన మేకలగండి ప్రాంతాన్ని ఎస్పీ గౌష్ ఆలం సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని

ప్రమాదానికి గురైన మాక్స్ పికప్ వాహనం

పరిశీలించారు. ఇద్దరు చిన్నారులు స్థానిక పాఠశాలలో చదువుతుండగా వారి మృతిపై పాఠశాలకు సెలవు ప్రకటించారు.

అతివేగంతో ప్రమాదాలు

- ఎస్పీ గౌష్ ఆలం

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారులు ట్రాఫిన్ నిబంధనలు పాటించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం ప్రమాదం జరిగిన గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి ప్రాంతాన్ని సందర్శించారు. వాహనదారులు అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సూచి బోర్డులు, రంబల్ స్ట్రిప్స్, ప్రమాదబోర్డులు, ఎల్లో బ్లింకింగ్ లైట్స్, వేగ నియంత్రణ బోర్డులు ఉన్న ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించాలని, జాతీయ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు డ్రంకన్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్ ఉన్నారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం

24 మంది అభ్యర్థుల హాజరు


రిమ్స్‌లో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్న అధికారులు

ఆదిలాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కోటాలో భాగంగా వరంగల్ కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీ రిమ్స్ వైద్య కళాశాలకు 75 ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కేటాయించింది. మొదటి రోజు 24 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు. రిమ్స్ అధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ నెల 3 వరకు మొదటి సంవత్సరంలో చేరడానికి సమయం ఉండగా.. రెండ్రోజుల్లో అందరూ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరవుతారని అధికారులు తెలిపారు. కౌన్సెలింగ్‌లో రిమ్స్ వైద్య కళాశాల నోడల్ అధికారి ప్రశాంత్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, ట్యూటర్ డాక్టర్ సింధూజ, అధ్యాపకులు రవీందర్, సిబ్బంది రాకేశ్, గణేశ్, ఆశన్న పాల్గొన్నారు.

సహాయకులను నియమించాలని జిల్లా వ్యవసాయాధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఈవోలు(ఫైల్)

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఈవోలు(ఫైల్)

పని ఒత్తిడిలో ఏఈవోలు

● డిజిటల్ సర్వే పనిభారంపై అసంతృప్తి ● సహాయకులను నియమించాలని డిమాండ్
● పట్టించుకోని ప్రభుత్వం.. ఆందోళన ఉధృతికి నిర్ణయం.. ● పది రోజులుగా కొనసాగుతున్న సహాయ నిరాకరణ

నిర్మల్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ శాఖ లక్ష్యసాధనలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ) అసంతృప్తికి గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ గోడును పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ తీరు మారాలంటూ డిమాండ్ చేస్తూ పది రోజులుగా సహాయ నిరాకరణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే తాము 49 రకాల పనులను నిర్వహిస్తున్నామని మండిపడుతున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్రికల్చర్ డిజిటల్ మిషన్‌లో భాగస్వాములు చేసి అదనపు భారాన్ని మోపాలని చూస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే తమ వల్ల కాదంటూ గత నెల 20 నుంచి సహాయ నిరాకరణ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్రికల్చర్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సాగుపై సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సర్క్యులర్ జారీ చేసింది. ఇందుకోసం అవసరమైన యంత్ర పరికరాలతోపాటు మానవ వనరులను సమకూర్చుకోవాలని రాష్ట్రాలకు సూచించింది. సర్వే నంబర్ల ఆధారంగా రైతులు ఏ పంటలు వేస్తున్నారు అనే వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. ఈ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో పంటల నమోదుకు అక్కడి ప్రభుత్వం ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)ను నియమించింది. మరికొన్ని రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాయి. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ విస్తరణ అధికారులకే(ఏఈవో) బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వాలు సర్వే కోసం అదనంగా ఉద్యోగులను నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నిర్వహణ కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను ఖర్చు పెట్టకుండా, ఇతర అవసరాలకు మళ్లించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలకు అదనంగా ఈ పనిని అప్పగించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

4.50 లక్షల ఎకరాలకు 79 మంది ఏఈవోలు

నిర్మల్ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. పంటలను పర్యవేక్షించేందుకు 79 క్లస్టర్లుగా విభజించి, క్లస్టర్‌కు ఒక ఏఈవోను నియమించారు. ప్రస్తుతం జిల్లాలో 79 మంది సాగును పర్యవేక్షిస్తున్నారు. కేవలం 79 మంది 4.50 లక్షల ఎకరాల భూముల్లో పంటల సర్వే నిర్వహించడం ఏ విధంగా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. 1000 ఎకరాలకు ఒకరిని నియమించినా 400 మందికి పైగా అవసరం ఉంటుంది. గతంలో మండలానికి ఒక వ్యవసాయ అధికారి మాత్రమే ఉండేవారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక ఏఈవో ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఏఈవోల నియామకాలు చేపట్టింది. ఒక్కో క్లస్టర్ పరిధిలో 8 నుంచి 10 పంచాయతీలు ఉండగా, రోజు రైతు వేదికల్లో గ్రామాలవారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి సాగుపై సూచనలు, సలహాలను ఇవ్వడం వంటి పనుల్లోనే ఏఈవోలు బిజీగా ఉంటారు. ప్రస్తుతం నిధులు లేక ఏఈవోలే స్వయంగా రైతువేదికలను శుభ్రం చేయిస్తూ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అదనంగా సర్వే భారాన్ని మోపడంపై మండిపడుతున్నారు. కాగా.. ఏఈవోలకు సహాయకులుగా వీఏఏలను నియమించాలని, రైతు వేదికల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పనిభారంతో సతమతమవుతున్నాం..

రెగ్యులర్ ఏవో లేకపోవడంతో రైతుబీమా, పీఎం కిసాన్, రుణమాఫీ విధుల్లో క్షణం తీరిక లేకుండా పని చేస్తున్నం. నా క్లస్టర్ పరిధిలో తొమ్మిది గ్రామాలు ఉన్నాయి. గ్రామ స్థాయిలో మాకు సహాయకులు లేకపోవడం వల్ల రోజువారి పనులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. కొత్తగా డిజిటల్ సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నది. కేవలం మూడు నెలల్లో 5 నుంచి 8 వేల ఎకరాల భూములను ఒంటరిగా సర్వే చేయడం ఏవిధంగా సాధ్యమవుతుందో ప్రభుత్వానికే తెలియాలి. ప్రతి గ్రామానికి ఒక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంటును నియమించాలన్న డిమాండ్‌తో శాంతియుతంగా నిరసన చేపడుతున్నాం. అలాగే రైతు వేదికలకు నిర్వహణ ఖర్చులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- జాడి తిరుపతి, ఏఈవో, దస్తూరాబాద్

సహాయకులు లేకుండా సర్వే చేయలేం..

క్షేత్రస్థాయిలో మ్యాపుల ఆధారంగా సర్వే నంబర్లను గుర్తించి సాగును నమోదు చేయవచ్చు. కానీ.. సబ్ డివిజన్స్ ఉన్నప్పుడు వాటిని రైతులే గుర్తించి చెప్పాలి. సహాయకులు, రైతులు లేకుండా ఒంటరిగా సర్వే పూర్తి చేయడం సాధ్యం కాదు. సర్వేలో రైతులను కూడా భాగస్వాములను చేయాలి. పొలాలు గ్రామాలకు దూరంగా కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాల్లో ఉన్న చోట ఆ భూముల్లో మహిళా అధికారులు ఒంటరిగా తిరుగుతూ సర్వే చేయడం వల్ల తీవ్రమైన భద్రతా సమస్యలు ఎదురవుతాయి. ఒక వెయ్యి ఎకారల్లో పంటల సర్వే చేయాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుంది. ఒక్కో క్లస్టర్‌లో ఐదు వేల నుంచి ఎనిమిది వేల ఎకరాల వరకు భూములు ఉంటాయి. సర్వే పూర్తయ్యేలోగా పంట కాలం పూర్తయి మళ్లీ కొత్త పంటలు వేస్తారు. సహాయకులు లేకుండా సర్వే చేయలేం. అందుకే గ్రామాల్లో వీఏఏలను నియమించాలని కోరుతున్నాం. గతంలో వ్యవసాయాధికారులకు సహాయకులుగా గ్రామాల్లో వీఆర్‌ఏలు ఉండేవారు.

- తాటికొండ హర్షిత, ఏఈవో, కుంటాల.

ప్రభుత్వం మానసిక వేధనకు గురిచేస్తున్నది..

గ్రామ స్థాయిలో సహాయకులు లేకుండా వ్యవసాయశాఖకు సంబంధించిన 49 రకాల రెగ్యులర్ విధులను నిర్వర్తిస్తూ ఇప్పటికే తలకు మించిన భారాన్ని మోస్తున్నం. దీనికి తోడు డిజిటల్ క్రాప్ సర్వే పేరిట రాష్ట్ర ప్రభుత్వం తమపై అదనపు భారాన్ని మోపాలని చూస్తున్నది. సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఏఈవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, ఒకరోజు వేతనాన్ని నిలిపివేయడం వంటి చర్యలతో ప్రభుత్వం తమను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నది. తమ డిమాండ్లు సాధించుకునే వరకు నిరసన కొనసాగిస్తాం.

- జీ.రాజ్‌కుమార్, ఏఈవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, నిర్మల్.

మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వైదిక కమిటీ, అధికారులు

దేవాదాయ శాఖ మంత్రికి ఆహ్వానం

బాసర, అక్టోబర్ 1 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ గురువారం నుంచి ప్రారంభం అయ్యే దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయాధికారులు ఆహ్వాన పత్రికను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ, దేవస్థాన ప్రధానార్చకులు సంజీవ్, వేద పండితులు నవీన్‌శర్మ, అధికారులున్నారు. అలాగే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవాలకు హాజరు కావాల్సిందని మంత్రి సీతక్కకు ఆలయ అధికారులు, వైదిక బృందం ఆహ్వాన పత్రికను అందజేశారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మను అందంగా పేర్చి సిద్ధం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగీత, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. - ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 1

ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

ఆదిలాబాద్ బస్టాండ్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు

సెలవుల రద్దీ

పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు తమ సొంత గ్రామాలకు ప్రయాణం అయ్యారు. మధ్యాహ్నం విద్యార్థులు తమ బ్యాగులు సర్దుకుని ఇంటికి వెళ్లడానికి బస్టాండ్‌కు చేరుకోగా.. తల్లిదండ్రులు పిల్లలతో ఆదిలాబాద్ ప్రయాణ ప్రాంగణం రద్దీగా మారింది. బస్సులు రద్దీగా వెళ్లడం కనిపించింది.

- ఆదిలాబాద్, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ)

వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

వయో వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఎదులాపురం, అక్టోబర్ 1 : వయో వృద్ధుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వారిని నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అదనపు ఎస్పీ సురేందర్, జిల్లా సమైఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండేలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెద్దలపై నేటి తరం చూపిస్తున్న వ్యవహారశైలిని పరిగణలోకి తీసుకుని వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవశ్యకతను గుర్తించడం జరిగిందన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లలో కావాల్సిన అన్ని సదుపాయాలు సమకూర్చడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ హియరింగ్ కోసం కలెక్టర్ చాంబర్‌కి రావడం ఇబ్బందికరంగా ఉన్నందున ఇక నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయడం, వయోవృద్ధుల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల అధ్యక్షుడు, మెంబర్లు తమ అభిప్రాయాలను తెలియజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో వృద్ధులకు సంబంధించిన సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 14567 కాల్ చేయవచ్చని అన్నారు. అంతకు ముందు ఈసీజీ, మెడికల్ క్యాంపులను సందర్శించారు. అలాగే వయో వృద్ధులను శాలువా, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, డీడబ్ల్యూవో సబిత, డీఆర్‌డీవో సాయన్న, అదనపు డీఎం హెచ్‌వో సాధన, వయోవృద్ధుల జిల్లా సమైఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, జనరల్ సెక్రటరీ రాంకులకర్ణి, డాక్టర్ సుధాకర్, సీనియర్ సభ్యులు కె.శివన్న, పల్ల సత్యనారాయణ, ఎన్.కిషన్ పాల్గొన్నారు.

కనులపండువగా బతుకమ్మ సంబరాలు

ఎదులాపురం, అక్టోబర్ 1 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను పూజించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులు కూడా కాలు కలిపి నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జె.సంగీత, అధ్యాపకులు, సిబ్బంది శ్రావణి, శ్రీధర్, మంజుల, జ్యోత్స్న, విద్య, రాధ, అఫ్రీన్, సలేహా, సుజాత, వనిత, సునీత, శోభ, సావిత్రి జగ్రామ్, సంతోష్ కుమార్, చక్రవర్తి, ప్రభాకర్, రమాకాంత్, రవి కిరణ్ పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్‌లో..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల సీవోఈ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను మంగళవారం నిర్వహించారు. దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ లలితాకుమారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ పువ్వులతో తయారు చేసిన బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడారు. బతుకమ్మ సంబరాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.రమణిక, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్‌లో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

దేవీ పూజకు వేళాయే..

● రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
● తొమ్మిది రోజులపాటు రోజుకో అవతారం
● ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు ● ముస్తాబైన సరస్వతీ ఆలయం

బాసర, అక్టోబర్ 1 : బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఉత్సవాలు అక్టోబర్ 3 గురువారం నుంచి 12వ తేదీ శనివారం వరకు జరగనున్నాయి. అమ్మవారు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. సరస్వతీ దేవికి పూజారులు విశేష పూజలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా నిర్వహించే ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వైద్య, పోలీసు, ఆలయ అధికారులు సేవలందిస్తారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బాలాజీ జగదీశ్ మహారాజ్ గడిపూర ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చి భక్తులకు ఉచితంగా అన్నదానం చేయనున్నారు. ఆలయంలో భక్తిపరమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు సేవలు అందించనున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు అన్నారు. ఉత్సవాలకు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గురువారం ఉదయం 9 క్షేత్ర, కలశ, విజ్ఞేశ్వర, సుహాసిని, శ్రీ సరస్వతీ సహస్రనామం, లలిత సహస్ర నామం, కుంకుమార్చనలు చేయనున్నారు.

అమ్మవారి రూపాలు..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శైలపుత్రి, రెండో రోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రాగంట, నాలుగో రోజు కుష్మాండ దేవి, ఐదో రోజు స్కంధామాత, ఆరో రోజు కాత్యాయని, ఏడో రోజు కాలరాత్రి, ఎనిమిదో రోజు మహాగౌరి, తొమ్మిదో రోజు సిద్ధి దాత్రి రూపాల్లో దర్శనం ఇవ్వనున్నారు. కాగా.. ఉత్సవాల్లో భాగంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఎస్పీ జనకి షర్మిల ఆధ్వర్యంలో ఏఎస్పీ అవినాశ్‌కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సై గణేశ్‌లు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఘటనలు చోటు చేసుకోకుండా నది వద్ద గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశారు.

బాసర సరస్వతీ అమ్మవారు

అన్ని ఏర్పాట్లు పూర్తి..

- విజయరామారావు, ఈవో.

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. క్యూలైన్‌లు, పార్కింగ్ ఏర్పాటు చేశాం. దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశాం.